విద్యార్థిని పట్ల ర్యాపిడో రైడర్ అసభ్య ప్రవర్తన

కేసు నమోదు చేసిన పోలీసులు

పోచారం: ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ర్యాపిడో రైడర్‌పై పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ పరిధి, సంస్కృతి టౌన్‌షిప్‌లోని ఓ వసతి గృహంలో సోదరితో కలిసి ఉంటున్న విద్యార్థిని(18) యంనంపేట్‌లోని ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 22న సాయంత్రం కళాశాల నుంచి వసతి గృహానికి వెళ్లడానికి ర్యాపిడో యాప్ ద్వారా బైక్ రైడ్ బుక్ చేసుకుంది. ఎడ్ల రాజశేఖర్ రెడ్డి రైడ్‌ను అంగీకరించి బైక్‌పై వసతి గృహానికి తీసుకెళ్లాడు. కాలేజీలో మధ్యంతర పరీక్షలు జరుగుతున్నందున మూడు రోజులు వరసగా బైక్‌పై కాలేజీకి తీసుకెళ్లి తీసుకురావాలని అడిగింది. మరుసటి రోజు అతను సక్రమంగానే ప్రవర్తించాడు. బుధవారం సాయంత్రం పరీక్ష పూర్తయ్యాక బైక్‌పై తీసుకుని గాంధీనగర్ మీదగా ఎల్‌ఐజీ కాలనీ వద్దకు రాగానే బైక్ వేగం తగ్గించి, ఆమెపై చేతులు వేస్తూ కాళ్లను తాకుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో విద్యార్థిని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూసేకరణ, పరిహారం పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పనుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు. కలెక్టరేట్ వీసీ హాలులో జాతీయ రహదారుల నిర్మాణాలపై గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూసేకరణ, పరిహారం పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని సూచించారు. కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, ఎన్టీసీఎల్ సూపరింటెండెంట్ మాలతి, ఎన్‌హెచ్‌ఏపీడీ శ్రీనివాసరావు, మేడ్చల్ తహసీల్దార్ భూపాల్ పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో కోర్టును ఏర్పాటు చేయాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో కోర్టును ఏర్పాటు చేసి ప్రజలకు మేలు చేయాలని న్యాయవాది కుర్ర పుణ్యరాజు గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే ప్రతి సంవత్సరం సుమారు రెండు వేల వరకు కేసులు నమోదు అవుతున్నాయని, మేడ్చల్ కోర్టుకు వెళ్లాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ మేరకు న్యాయస్థాన సాధన సమితి ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు.

మల్లారెడ్డి యూనివర్సిటీలో హ్యాకథాన్

మేడ్చల్‌రూరల్: ఇంజినీరింగ్ విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు మొదటి ఏడాది నుంచే ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు మల్లారెడ్డి విద్యా సంస్థల చైర్మన్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీ, మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీలకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం మల్లారెడ్డి యూనివర్సిటీ ప్రాంగణంలో మెగా హ్యాకథాన్ గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో డీన్ ధనుంజనాచారి, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రాణాలు పోతేనే స్పందిస్తారా?

కుంటను తలపిస్తున్న మూడుచింతలపల్లి- కీసర రోడ్డు

- తమ పరిధి కాదంటున్న పలు శాఖల అధికారులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



శాలవాని కుంట లీకేజీతో మూడుచింతలపల్లి - కీసర రోడ్డుపై నిలిచిన నీరు

శామీర్‌పేట్: ఆ రోడ్డు మీదుగా ప్రయాణించాలంటే భయం.. రాత్రి వేళలో అయితే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన దుస్థితి.. రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతల్లో పెద్దఎత్తున నీరు చేరుతోంది. అందులోంచి వెళ్లే క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మున్సిపాలిటీ కేంద్రంలో మూడుచింతలపల్లి – కీసర రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. శాలవానికుంట సమీపంలో భారీ గుంతలు ఏర్పడి కుంటలా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేసినా ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, స్థానిక మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.



గుంతల్లోంచి ప్రయాణిస్తున్న వాహనాలు

అధికారుల సమన్వయ లోపంతో..

ఇటీవల కురిసిన వర్షాలతో శాలవానికుంట నిండింది. దీంతో కుంట కట్ట నుంచి లీకేజీ ఏర్పడటంతో నీరు కీసర– మూడుచింతలపల్లి రోడ్డులో నిలిచి కుంటలా తయారైంది. ఇదిలా ఉండగా చెరువు కట్ట నుంచి నీరు లీకవుతుండటంతో ఇరిగేషన్ శాఖ అధికారులు మరమ్మతులు చేపడతారని, ఆర్అండ్‌బీ రోడ్డుపై ఏర్పడినందున ఆ శాఖ అధికారులు సమస్యను పరిష్కరిస్తారని, నీరు నిల్వకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని ఇలా.. ఎవరికి వారు మరో శాఖపై తోసేసి కాలం వెళ్లదీస్తున్నారని, సమస్యను మాత్రం పరిష్కరించడం లేదంటూ మున్సిపల్ ప్రజలు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల అలసత్వం



ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు మరో శాఖపై తోసేస్తూ కాలం వెల్లదీయడం దుర్మార్గం. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని మున్సిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకువెళ్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ గుంతలలో పడి మా బంధువులు తీవ్రంగా గాయపడ్డారు. సాకులు చూపకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యకు పరిష్కారం చూపాలి.

– హరిమోహన్‌రెడ్డి, పోతారం.

నీటి లీకేజీని అరికడితే..

కుంట లీకేజీ వల్లే ఆర్అండ్‌బీ రోడ్డు దెబ్బతింటోంది. రోడ్డు దెబ్బతిని వాహనదారులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. శాలవానికుంట కట్ట నుంచి వస్తున్న నీటిని కాలువ ద్వారా మళ్లిస్తే నీరు నిలవదు. ఈ పని ఇరిగేషన్ శాఖ పరిధిలోకి వస్తుంది. నీటి లీకేజీని అరికడితే రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చేస్తాం.

– సింధు, ఆర్అండ్‌బీ ఏఈ, మూడుచింతలపల్లి మండలం.

వేసవి కాలంలోనే మరమ్మతులు

ఇటీవల కురిసిన వర్షాలతో మూడుచింతలపల్లి శాలవానికుంట నిండిపోయి కట్ట లీకేజీ అవుతోంది. లీకేజీ అయిన నీరు ఆర్అండ్‌బీ రోడ్డులోని కల్వర్టు ద్వారా పెద్దకాలువలో కలవాలి. కానీ కల్వర్టు మట్టితో నిండిపోయింది. దీంతో రోడ్డుపై నీరు నిలుస్తోంది. ఆర్అండ్‌బీ అధికారులు కల్వర్టుతో పాటు రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాల్సిన అవసరం ఉంది.

– స్వప్న, ఇరిగేషన్ ఏఈ, మూడుచింతలపల్లి మండలం.

ఓయో నిర్వాహకులకు నోటీసులు



పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్ సమీపాన భగత్‌నగర్ కాలనీలో ఇంటి నంబర్ 13–10/75) ఓయో రెస్ట్‌రూమ్‌లను ఏర్పాటు చేసిన నిర్వాహకులకు పోచారం మున్సిపల్ కమిషనర్ నిత్యానందర్ గురువారం నోటీసులు జారీ చేశారు. ఓయో వల్ల తాము ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని పలువురు స్థానికులు బుధవారం ఫిర్యాదు చేయడంతో కమిషనర్ స్పందించారు. ఓయో ఏర్పాటుకు కావాల్సిన అర్హతలను నిర్వాహకులు మూడు రోజుల్లో నిరూపించుకోవాలని నోటీసులో పేర్కొన్నారు. లేబర్ లైసెన్స్ సర్టిఫికేట్, స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఎన్‌ఓసీ, ఫుడ్ సేఫ్టీ కమిషనర్ నుంచి అనుమతి, ఫైర్ సేఫ్టీ సర్టిఫికేట్, ప్రాపర్టీ సేల్ డీడ్, భవన నిర్మాణ అనుమతి, ట్రేడ్ లైసెన్స్, విద్యుత్ శాఖ నుంచి కమర్షియల్ కరెంట్ కనెక్షన్ తదితర పత్రాలను మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

కొత్త మద్యం దుకాణాల కేటాయింపు

సాక్షి, మేడ్చల్ జిల్లా: కొత్త మద్యం దుకాణాలకు టెండర్లను మేడ్చల్ జిల్లా అబ్కారీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 118 దుకాణాలకు గాను 101 దుకాణాలను ఓపెన్ కేటగిరీ, 11 గౌడ కులస్తులు, ఐదు షెడ్యూల్డ్ కులాలకు, ఒకటి షెడ్యూల్డ్ తెగలకు, మల్కాజిగిరి యూనిట్‌కు సంబంధించిన 88 దుకాణాలకు గాను 68 ఓపెన్ కేటగిరీకు, 12 గౌడ కులస్తులకు, 7 షెడ్యూల్ కులాలకు, ఒక షెడ్యూల్ తెగకు జిల్లా కలెక్టర్ మనుచౌదరి సమక్షంలో డ్రా ద్వారా కేటాయించారు. ఈ మేరకు గురువారం నిర్వహించిన కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జిల్లా బీసీ ఆఫీసర్ ఝాన్సీరాణి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్, జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వినోద్ కుమార్, మేడ్చల్, మల్కాజిగిరి యూనిట్స్ జిల్లా ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా బతుకమ్మ సంబురాలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రతిరోజూ తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి రోజుకు ఒక తీరు నైవేద్యం సమర్పించి మహిళలంతా ఎంతో ఉత్సాహంగా గురువారం మేడ్చల్ కలెక్టరేట్‌లో బతుకమ్మ పండగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఆటలు ఆడటం వారి మానసిక ఆరోగ్యానికి ఎంతో అవసరమని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా ఐదో రోజు అట్ల బతుకమ్మను పురస్కరించుకుని కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. డీఆర్డీఓ, విద్యాశాఖ, సీపీఓ, మెప్మా, డీటీడీఓ, జిల్లా బీసీ, ఎస్సీ, మైనార్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు కొనసాగాయి. బతుకమ్మ వేడుకలో డీఆర్ఓ హరిప్రియతో కలిసి అదనపు కలెక్టర్ రాధికాగుప్తా బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో డీఆర్డీఓ సాంబశివరావు, డీఈఓ విజయకుమారి, సీపీఓ శేఖర్, బీసీ వెల్ఫేర్ జిల్లా ఆఫీసర్ ఝాన్సీరాణి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి వినోద్‌కుమార్, మైనార్టీ అధికారి కాంతమ్మ, ఉపాధి కల్పన అధికారి రాధిక తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్‌కు ఘన నివాళి

మేడ్చల్: ఎల్లంపేట్, మేడ్చల్ మున్సిపాలిటీలలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు మున్సిపాలిటీల బీజేపీ నాయకులు శైలజ, ప్రభాకర్‌రెడ్డి, ప్రేందాస్, బాబు, వంశీ విజయ్, శ్రీకాంత్, ఈశ్వర్, లక్ష్మణ్, సర్వేశ్వర్‌రెడ్డి, అర్జున్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చౌరస్తాలో..

ఘట్‌కేసర్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాళ్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు రామోజీ పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో..

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ బీజేపీ పశ్చిమ అధ్యక్షుడు కమలాకర్ ఆధ్వర్యంలో గురువారం బీజేపీ కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని నిర్వహించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రంగుల శంకర్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి సంతోష్‌గుప్తా, నాయకులు పుణ్యరాజు, లిఖితయాదవ్, నరేష్‌యాదవ్, రామునాయక్, సన్నీ, యాదగిరి, లత, రాజు నాయక్, రవి ముదిరాజ్, సంతోష్ పాల్గొన్నారు.



మేడ్చల్‌లో పండిట్ దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



ఘట్‌కేసర్‌లో పండిట్ దీన్‌దయాళ్ జయంతి వేడుకలు



జవహర్‌నగర్‌లో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళులర్పిస్తూ..

రుణమాఫీ చేయకుండా సర్కారు మోసం



ఘట్‌కేసర్‌లో రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు

ఘట్‌కేసర్: ఎన్నికల ముందు హామీ ఇచ్చి గద్దెనెక్కిన అనంతరం రుణమాఫీ చేయకుండా రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రైతు రుణమాఫీ సాధన సమితి అధ్యక్షుడు గౌరీశంకర్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఎద్దేవా చేశారు. రాజారమేశ్, రమేశ్, బాలనరసింహ దీక్షలు చేపట్టగా ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ఉదయ్‌కిరణ్‌రెడ్డి, మహేశ్వర్‌గౌడ్, సంజీవరెడ్డి దీక్షలకు మద్దతు ప్రకటించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్షలు తప్పవు

ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ బాలస్వామి

ఘట్‌కేసర్: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్షలు తప్పవని, ర్యాగింగ్‌తో జీవితంలో గమ్యాన్ని చేరుకోలేరని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి అన్నారు. ఘనాపూర్ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల (కేపీఆర్‌ఐటీ)లో ర్యాగింగ్ కారణంగా కలిగే పరిణామాలు, శిక్షలు, ర్యాగింగ్ నివారణపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ బాలస్వామి మాట్లాడుతూ కళాశాలలో శాంతియుత వాతావరణం, స్నేహపూర్వకంగా ఉండేందుకు క్రమశిక్షణ, బాధ్యత అవసరమన్నారు. ర్యాగింగ్ కారణంగా ఒక్కోసారి తోటి విద్యార్థులకు ప్రాణసంకటంగా మారుతోందన్నారు. అధ్యాపకులు, తల్లిదండ్రులు సూచించిన మార్గంలో ప్రయాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ర్యాగింగ్ లేని కళాశాలను నిర్మించడంలో విద్యార్థులు ముందుండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్.శ్రీనాథ్‌కశ్యప్, చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జి.నాగారాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



కీసరలో పరిసరాలను శుభ్రం చేస్తున్న కమిషనర్ వెంకట్‌రెడ్డి, కాలనీవాసులు

కీసర: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని కమిషనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని తిమ్మాయిపల్లి, కీసరలో స్వచ్ఛత హీ సేవలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డుకు ఇరువైపులా చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, కాలనీవాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాగారం డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో..

కీసర: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఏక్‌దిన్- ఏక్‌సాత్-ఏక్‌గంట కార్యక్రమంలో భాగంగా నాగారం మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ భాస్కర్‌రెడ్డి, కాలనీవాసులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో డీఈఈ సంతోష్‌కుమార్, రెవెన్యూ అధికారి నాగేశ్వర్‌రావు, మేనేజర్ సురేష్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ శ్రావణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్రదీప్, బాబు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి వచ్చేసరికి ఇంటిలో చోరీ

ఘట్‌కేసర్: ఆస్పత్రికి వెళ్లి వచ్చేసరికి గుర్తు తెలియని దుండగులు ఇంట్లోని వెండి వస్తువులు ఎత్తుకెళ్లిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్ గణేశ్ నగర్‌లో నివసించే పులిగిల్ల నర్సయ్య బంధువులు ఆస్పత్రిలో చేరగా వారిని చూసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 22న వెళ్లి తిరిగి గురువారం ఉదయం ఇంటికొచ్చాడు. ఇంటిలోకి వెళ్లి పరిశీలించగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. అల్మారాలో వెతకగా దాచుకున్న 20 తులాల వెండి ఆభరణాలను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీలు పరిశీలించి నిందితుల కోసం గాలిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



ఘట్‌కేసర్‌లో కాత్యాయని దేవి అలంకారంలో..



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధి రాంపల్లిలోని శ్రీచక్రపీఠంలో..

గాయత్రి దేవి అలంకారంలో అమ్మవారు



గాయత్రి దేవిగా గడి మైసమ్మ అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు గురువారం అమ్మవారు గాయత్రి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం నుంచే భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లావ్యాప్తంగా ఆయా కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారికి పెద్దఎత్తున పూజలు నిర్వహించారు.

– మేడ్చల్ జోన్ బృందం



కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గాయత్రీ దేవి అలంకరణలో..



పూదూర్‌లోని పోచమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు